# హోనేప్పుడులా చంచలా

రచన: ఇచ్ఛాపురపు జగన్నాథరావు

బయట చాలా వేడిగా ఉంది.

నా రైలు ఆరుగంటల పదిహేను నిమిషాలకి... ఇంకా రెండు గంటల టైమ్ ఉంది. నేను కలకత్తా కొచ్చిన పని అయింది. మామూలుగా అయితే చివరి నిమిషం దాకా వాసుతోనే గడిచిపోయేది. అతనూ ఇక్కడినించి వెళ్ళిపోయాక ఇంక చెయ్యాల్సిం దేమీలేదు... ఈ రెండుగంటల కాలాన్నీ ఎలాగో చంపడం తప్ప.

సామాన్లు స్టేషనుకి వెళ్ళిపోయాయి. హౌరాస్టేషన్‌లో రెండు గంటలు గడపడం నాచేతకానిపని; ఆ జనసమూహం, లోన నిలిచిపోయినపొగ, గాలిరాని వేడి, భరించ లేని రొద – అన్నీ కలిసి నన్ను పిచ్చివాడిని చేస్తాయి.

హోటల్‌నించి బయటికివచ్చి పార్క్‌స్ట్రీట్‌కి వెళ్ళేను. జనసమ్మర్దం చాల తక్కువగా ఉంది. సాయంత్రం ఆరుకి కాని ఇక్కడ జీవితంలోకి పూర్తి కాంతి రాదు! విండోషాపింగ్‌కి కూడా కుదరని ఎండ. అలాగ నడిచి ట్రింకాస్ దాకా చేరు కున్నాను.

అక్కడ పుస్తకాలషాపు ఒకటి ఉంది. ఇక్కడికి వొచ్చినప్పుడల్లా ఒకటో రెండో పుస్తకాలు కొనుక్కోవడం నాకు అలవాటు: రంగు రంగుల, రకరకాల పుస్తకాలు, దేశదేశాల పత్రికలూ చూస్తే ఎంతో సరదా నాకు.

ఇంటికి చేరగానే, "ఏం పుస్తకాలు తెచ్చారీసారి?" అనిసుజాత అడుగుతుంది.

ఆమెకి పుస్తకాలంటే పెద్ద సరదా ఏమీ లేదు; కాని, డిటెక్టివ్ నవలలన్నా, ముఖ్యంగా జేమ్స్ బాండ్ పుస్తకాలన్నా చాలా ఇష్టం. నాకవి పడవు.

"నీకేం తెలేదు" అనడం నా కలవాటు.

"నాకు తెలుసును!" అని జీవితంలో ఏ ఒక్క కలనీ నిజంచేసుకోలేని అసహాయత నిండిపోయిన కళ్ళతో నిట్టూర్చి, మిగిలిన ప్రశ్నలు వెయ్యడం సుజాతకి అలవాటు.

కొంతసేపు ఆ పుస్తకం, ఈ పుస్తకం తీసి, చూసి, కిందపెట్టి, కాలక్షేపం చేశాను. పుస్తకాలన్నీ పేవ్‌మెంట్ మీద పరిచి ఉంచడంవల్ల ఆ పరీక్ష కొంత దైహికబాధ కలిగిస్తుంది. నిలబడి ఒక్కసారి అటూ ఇటూ చూశాను.

ఆక్స్‌ఫర్డ్ స్టేషనరీ షాపుదగ్గర ఆమె కనిపించింది – ఎవరితోనో మాట్లాడుతూ, అతనెవరోకాని, ఆమెవరోకాని, మాటలు నాకు వినిపించలేదు. కాని, ఆమె చిరునవ్వు కనిపిస్తోంది, ఈ పక్కనించి.

నాకే ఆలోచనలు వొచ్చాయో నాకే తెలియలేదు – ఏ ఒక్కటీ స్పష్టంగా లేదను కుంటాను.

నాలుగైదు నిమిషాలలాగే నిలబడి పోయాను. నాదృష్టి ఆమెమీదే ఉంది; నాఆలోచన లెక్కడో ఉన్నాయి.

"లేటెస్ట్ అమెరికన్ బుక్స్ సార్!" అంటూ, కూర్చున్న బల్లకింద దాచిన వేడి పుస్తకాలు తీసి నాకుచూపే ప్రయత్నంలో పుస్తకాల విక్రేత నాదృష్టి ఇటుమళ్ళి మర ల్చేడు.

ఒక పుస్తకం చేతిలోకి తీసుకుని, రెండు క్షణాల తరవాత మళ్ళీ ఆమెవైపు చూశాను. ఈసారి ఆమె తనతో మాట్లాడు తున్న యువకుడి చెయ్యి తన చేతిలోకి తీసుకుంది. అతను చిరునవ్వుతో అన్నాడు. వెంటనే ఇద్దరూ బుక్ షాప్‌లోకి వెళ్ళిపోయారు.

ఈసారి బలంగా నాదృష్టిని మళ్ళీ పుస్తకాలమీదకి మరల్చుకుని, చేతిలో ఉన్న వాటిని తిరిగిఇచ్చి, రెండు పుస్తకాలు తీసుకుని డబ్బిచ్చి ముందరకి అడుగు వేశాను. నాలోఉన్న మానవత్వం అక్కడి నించి వెళ్ళిపోమని చెప్తోంది: నాలోఉన్న కౌతుకం, వెళ్ళనియ్యడంలేదు. నా వాగ్దానం నిలబెట్టుకోవాలనీ, అక్కడినించి వెళ్ళి పోవాలనీ చేసే ప్రయత్నంలో తొందరగా నడిచి క్వాలిటీ లోపలికి వెళ్ళేను.

బయటి ఎండ తరవాత లోపల ఎంతో చల్లగా ఉంది; విశృంఖలంగా ఉన్న ఆ పరి సరాలు ఇంకో లోకంలోకి నన్ను తెచ్చాయి.

స్నాక్స్, కాఫీ ఆర్డరుచేసి వెళ్ళి ముఖం చేతులూ కడుక్కుని వొచ్చాను. ఈ ఉప

శమనం మనస్సులో రేగుతూన్న వేడిని ఏమీ తగ్గించలేదు. ప్రయత్నించినా, పుస్తకం మీద దృష్టి నిలవలేను. ఆమే నా ఆలోచనల్ని పూర్తిగా ఆక్రమించుకున్నది. ఒక వాగ్దానాన్ని భంగపరచుకుని ఆమెని గురించి ఆలోచించేను. జ్ఞాపకాలు తెచ్చుకుని.

* * *

సంవత్సరం ఆరు మాసాలై పోయింది - అవును. అది నవంబరు. అప్పటి చలి ఇంకా జ్ఞాపకం ఉంది. ఇక్కడ డెమోక్రటిక్ ఫ్రంట్ ప్రభుత్వంలోకి రాలేదు... వ్యాపారం పనితో వచ్చాను. కలకత్తా వస్తూ వాసుకి టెలిగ్రాం ఇచ్చేను.

అతను నేను వచ్చినరోజే సెలవుమీద



ఇంటికి వెడుతున్నాడు. రోజంతా అతనితో గడిపి సాయంత్రం అతన్ని హౌరా స్టేషన్‌లో వొదిలి వచ్చాను. అతను తన కారూ, తన ఇల్లూ నా స్వాధీనం చేసి వెళ్ళిపోయాడు.

అతని కారు డ్రైవ్ చేసుకుంటూ మేయో రోడ్ దాకా వొచ్చేసరికి అక్కడ పెద్ద జనసమూహం కనిపించింది. ఎవర్నీ అడగకుండానే గ్రహించేను. ఏదో అల్లరి చౌరంగీ ప్రాంతంలో జరుగుతోందని. నాకు ఇక్కడ జీవితం నాలుగేళ్ళ అనుభవం.

రెడ్‌రోడ్ పట్టి లోవర్ సర్క్యులర్ రోడ్ మీంచి ఎలాగో కామక్ స్ట్రీట్ చేరుకున్నాను. దారిలో ఒకటిరెండు చోట్ల గూండాలు గుమిగూడబోతున్నారు : ఇంకో పది పదిహేను నిమిషాల్లో వారందరూ కలిసి ఆ పరిసరాల్లో విధ్వంసక కార్యాలు ప్రారంభిస్తారు. కార్లని నడవనీరు ; పెట్రోలు తీసుకుంటారు – బస్సులకీ, ట్రాముఁకీ నిప్పంటించేందుకు.

ఏం జరిగిందో తెలుసుకోవాలనే కుతూహలం వున్నా, దానిని అవధిలో పెట్టే జ్ఞానంతో, అదృష్టం ఇచ్చిన అవకాశంతో, ఇంటి దరిదాపుకి చేరేను. చివరిమలుపు తిరుగుతూ లైట్లు వేసేసరికి అక్కడ గేటు ప్రక్కన చీకట్లో ఇమిడిపోతూ ఆమె కనిపించింది.

అప్రయత్నంగా కారాపి, కిందికి దిగేను. నా లైట్ల కాంతికి అలవాటుపడే ప్రయత్నములో ఉంది.

ఎదురుగా నిలబడి ఆమెని పరీక్షగా చూశాను. చేతిలో బేగ్, ఒక పేకెట్ పట్టుకుంది : వయస్సు ఇరవైలలో ఉంటుంది. బహుశా ఎవరో ఆఫీసులో పని చేసే అమ్మాయి అనుకున్నాను.

"ఇక్కడ ఎందుకు నిలబడ్డావు ?" అని అడిగేను.

నిస్పృహాయంగా చూస్తూ, "ట్రాఫిక్ అంతా ఆగిపోయింది. అక్కడనించి ఒచ్చేశాను," అంది కంగారుగా.

"ఎంతసేపు నిలబడతావు ?"

కంగారుగా చూసింది.

"ఈ ఇల్లు మీదా ?"

"అవును."

"అక్కడ అల్లరి తగ్గేదాకా..."

"ఇంట్లోకి వెడదామా ?...రోడ్డు మీద ఎంతసేపని ఉంటావు ?"

ఆమె కదల్లేదు. నా వెనకనించి హెడ్ లైట్ల కాంతికిరణాలు ఆమె కళ్ళల్లో పడుతున్నాయి. నేను సరీగా కనిపించి వుండను.

కొంచెం దూరంలో, చౌరంగీ రోడ్ వేపు తుపాకుల శబ్దంలాగ వినిపించింది. పక్కఇంటి గార్డెన్‌లో ఆల్సేషియన్ భయంకరంగా మొరిగింది.

నన్ను పరీక్షగా చూస్తోన్న ఆమె తటాలున వొచ్చి తలుపు తీసుకుని కారులో కూర్చుంది. నెమ్మదిగా లోపలికి వెళ్ళి కారుని గరాజ్‌లో పెట్టి ఇంటితాళం తీసి ఆమెని మీదకి తీసికెళ్ళాను. లోపలికి వెళ్ళగానే ఆమె నీరసంగా కుర్చీలో కూలబడింది.

"టీ తాగుతావా ?"

"ఆఁ..."

కిచెన్‌లో గేస్‌రేంజ్ ఉంది. టీ చేసి, ట్రేలో తెచ్చి పెట్టేను. ఆమె అలాగే కూర్చుని ఉంది.

ఆమెని చూసి చాలా జాలివేసింది.

"ముఖం కడుక్కో, టీ తాగుదాం."

బాత్‌రూమ్ చూపెట్టి వొచ్చి ఆమె వొచ్చేసరికి ఫ్రిజ్‌లోనించి స్వీట్సూ, కిచెన్ నించి బిస్కట్లూ తెచ్చి ఉంచేను.

ఆమె ఆకలిగా ఉన్నట్టుంది – అభ్యంతరం చెప్పకుండాఅవి నాతోబాటుతీసుకుంది.

టీ త్రాగటం ముగిసేదాకా ఆమె ఏమీ మాట్లాడలేదు – నేనూ అనేక ఆలోచనల్ని లోలోపలే దాచుకుని, నిశ్శబ్దాన్ని భంగపరచలేదు. మధ్యన రెండుమూడుసార్లు దూరాన్నించి రకరకాల శబ్దాలు వినపడ్డాయి. వాటికి ఆమె బెదిరిపోయినా, మరుక్షణం, సర్దుకుంది.

"థాంక్స్ !" అంది, చివరికి.

"బాగా అలిసిపోయావు" అన్నాను.

"అవును – నాలు గ్గంటలకి వొచ్చేను. అప్పటినించీ బస్సుల్లేవు: ట్రాముల్లేవు. టాక్సీలూ కినపడడం మానేశాయి."

నేను స్టేషనుకి వెళ్ళేటప్పు డా విషయం గమనించలేదు – వాసుతో కబుర్లలోపడిపోయా ననుకుంటాన్నాను.

"ఎక్కణ్ణించి వొచ్చావు ?"

"మా ఆఫీసు కిద్దర్‌పూర్‌లో ఉంది – వాళ్ళు నన్ను రోజూ ఇక్కడ వొదుల్తూ ఉంటారు."

"మీ ఇల్లెక్కడ ?"

"శ్యామ్ బజారులో..."

అప్పటికికాని, ఆమె పూర్తి పరిస్థితి నా కవగాహన కాలేదు.

"ఇక్కడికెలాగ వొచ్చావు ?"

"ట్రామ్ కోసం చూసి చూసి అలిసిపోయేసరికి రెండుమూడు గుంపులు పోలీస్ వాన్‌మీద రాళ్ళురువ్వడం చూసేను... తప్పించుకుంటూ వొచ్చి వొచ్చి చివరికి అక్కడ నిలబడ్డాను. అటువేపు వెళ్తే కుక్క... దాని అరుపు వింటే భయం నాకు..."

"భయం ఏమీలేదు. పరిస్థితులు చక్కబడకపోవు. నేను స్నానంచేసి వస్తాను. కూర్చో" అని లోపలికి వెళ్ళబోయాను.

"తలుపులు లాక్‌చేసి వెళ్ళండి..."

కొంచెం సందేహంగా అంది. కాని, ఆమె కళ్ళల్లో ఎంతో భయం కనిపించింది.

ఆమె చెప్పినట్టు చేసి లోపలికి వెళ్ళి స్నానంచేసి వొచ్చాను. ఆ ఎండలో తిరిగాక స్వర్గసుఖం పొందుతూన్నట్టు ఉంది.

నేను వొచ్చేసరికి ఆమె రేడియో వింటోంది – స్థానిక వార్తలలాగ ఉంది. నన్నుచూసి రేడియో కట్టేసి, ఊరంతా కల్లోలంగా వుంది. సెంట్రల్ ఎవెన్యూలో బస్సుఏక్సిడెంట్ అయికొట్లాటలు ప్రారంభమయాయిట... అక్కడ సాగుతున్న ప్రొసెషన్‌లో ఒకరు చావడంతో ఊరంతా పొక్కిపోయింది..."

నేను క్షేమంగా రా గలగడం నాకే ఆశ్చర్యం వేసింది. లక్షలాది బాధితుల్ని చేతుల్లో దాచుకోగల ఈ మహానగరం ఉద్రిక్తం ఐపోయినప్పు డెలాగ ఉంటుందో నాకు తెలుసు.

ఆ ఆలోచనల్లోనించి ఆమె నవ్వువిని ఇవతలకి వచ్చాను.

"ఏమిటి?" అన్నాను.

"మిమ్మల్ని చూసి, ఈర్ష్య. నాకూ స్నానం చెయ్యాలని ఉంది..."

ఆమెకి అవసరమైన వస్తువులన్నీ ఇచ్చి పంపేను. చాలా రాత్రిదాకా ఆమె పోలేదని తెలుసును. బహుశా, పరిస్థితుల్నిబట్టి చూస్తే, ఆమె రేపు ఉదయందాకా ఇక్కడే తలదాచుకోవలసి వొస్తుంది. తల్లికోపం లాగ, ఇక్కడ అల్లర్లూ ఉదయానికి ఉండవు. కాని...

తొమ్మిది దాటుతోంది. పార్క్‌స్ట్రీట్‌లో ఉన్న ఒక హోటలు ప్రొప్రయిటరు నాకు బాగా తెలుసును. అతనికి ఫోన్ చేసి, తినేందుకు భోజనం పంపమన్నాను.

"ఇక్కడికి రా... మాట్లాడుకుందాం" అన్నాడు అతను.

"కుదరదు–ట్రంక్‌కాల్ రావాల్సిఉంది" అన్నాను–అప్రయత్నంగానే అబద్ధం చెప్తూ.

ఫోన్ కిందకి పెట్టేసరికి నాకే ఆశ్చర్యం వేసింది. నేను చేసినదానిలో కాని, నా ఆలోచనల్లోగాని, తప్పు ఏమీలేదు–అబద్ధం ఎందుకు చెప్పినట్టు?

సిగ్గు పడ్డాను.

అప్పటిదాకా, ఒక నిస్సహాయికి కష్ట పరిస్థితుల్లో కొంచెం సహాయం చేసే ఉద్దేశం తప్ప, నాలో మరే ఆలోచనా లేదు. ఆమెని మొట్టమొదట చూసినప్పుడు నా దారిన నేను పోయే ఆలోచన క్షణికంగా వొచ్చినది నిజం; కాని సామాన్యంగా మానవుడిలో ఉండాల్సిన కొంచెం సౌహార్ద్రత ఆ ఆలోచనని వెంట తరిమింది.

ఆమె రావడం ఆలశ్యం ఔతోంది.



రేడియో పెడితే మంచి సంగీతం ఏమీ రాలేదు.

గ్రామ్ పెట్టగానే, బిస్మిల్లాఖాన్ షెహనాయ్ రికార్డు ఎంతో చల్లటి సంగీతాన్ని అందివ్వసాగింది. ఆ సంగీత మాధుర్యంతో బాటు, అవతల జరుగుతూన్న గొడవలకి ఇంతదూరంగా, ఇంత క్షేమంగా ఉండగలిగిన పరిస్థితులు విచిత్రమైన అనుభూతిని యిచ్చేయి.

లాంగ్‌ప్లే రికార్డు నన్ను మరో లోకానికి తీసికెళ్ళిపోయింది. ఆమె వొచ్చి "ఎంత తియ్యగా ఉంది సంగీతం!" అనడంతో మళ్ళీ నా దివినుంచి భువికి వొచ్చేను.

సాయంత్రం నేను చూసిన మనిషికీ, ఈ అమ్మాయికీ ఎక్కడా పోలికలేదు శుభ్రంగా స్నానంచేసి, ఎంతో కాంతిగా కనిపిస్తోంది.

"ఈ సంగీతం – నీ కిష్టమేనా?" అన్నాను.

ఎదురుగా కూర్చుంటూ, "ఆఁ..." అంది.

"నీ పేరేమిటి?"

ఇప్పటిదాకా ఆమెపేరే నాకు తెలీదు–నా వయస్సు ఇచ్చిన అధికారంతో ఆమెని ఏకవచన సంబోధనతోనే పిలిచాను. కాని, హఠాత్తుగా ఆమెపేరు నాకు కావలసి వొచ్చింది.

ఆమె ఏమీ మాట్లాడలేదు. సంగీత తరంగాలలో తేలిపోతోందా? కాని, స్పష్టంగా ఆమె ముఖంలో ఆందోళన కనిపించుతోంది.

నా ప్రశ్న ఆమె వినలేదనుకున్నాను.

"ఏమిటాలోచిస్తున్నావు?"

"ఇంటిమాట..."

"ఇప్పుడప్పుడే వెళ్ళడం కుదరదు."

"అదే... అమ్మ ఆందోళన పడుతూ ఉంటుంది."

"మీ నాన్నగారు..."

"ఇక్కడ లేరు - ఆయన - ఊరికి వెళ్ళేరు."

"టెలిఫోన్ చెయ్యి."

"మా ఇంట్లో ఫోన్ లేదు."

"పోనీ-చుట్టుపక్కల ఎక్కడైనాచెయ్యి"

"అలాగా ఎవరూలేరు!"

"మరి ఏంచేస్తావు?"

"అదే ఆలోచిస్తున్నాను."

ఆమె సమస్య ఆ క్షణాల్లో ఆమె కెంత జటిలంగా కనిపించినా, నాకు పెద్దబాధ కలిగించనిది నిజం. ఆమె ఆలోచనలకి ఆమెని వొదిలి, నేను సంగీతాస్వాదనలో ఇదంతా మరిచిపోయే ప్రయత్నం చేశాను. కాని, ఆమెలో కనిపిస్తోన్న ఏదో కొత్తదనం నా దృష్టిని చాలా సేపు మరల నివ్వలేదు. ఎవరి ఆలోచనల్లో వాళ్ళం ఉండిపోయేం. మధ్య మధ్య దూరంనించి అరుపులూ, కేకలూ, ఇతర ధ్వనులూ వినిపిస్తూనే ఉన్నాయి. కాని ఆమె నిశ్చలంగానే ఉండిపోయింది—

కాల్‌బెల్ నిశ్చలాన్ని ఆమెనీ బెదరగొట్టింది. ఆమె ప్రశ్నిస్తోన్న కళ్ళతో నా వైపు చూసి బాల్కనీలోకి వెళ్ళిపోయింది

నేను తలుపుతీశాను. హోటలునించి కేరియర్‌లో భోజనం తెచ్చేడు బేరర్. వాడికి డబ్బులిచ్చి పంపివేసి మళ్ళీ తలుపువేశాను.

నేను పిలిచేదాకా ఆమె లోపలికి రాలేదు.

"నీ పేరు ఏమిటన్నావు?"

"ఏమిటీ అనలేదు." ఆమె నవ్వుతోంది.

"మరి?"

"మీరే చెప్పండి!"

నవ్వులాటలో ఒకమాట స్పష్టం ఐంది- ఆమె తన పేరు నాకు చెప్పదలుచుకోలేదు.

"పద భోజనం చేద్దాం."

"నా కాకలిగా లేదు ఇంకా."

"అయినా సరే.. రొట్టెలు చల్లారితే తినలేం."

నన్ను వారించి ఆమె టేబిల్‌మీద అన్నీ అమర్చింది.

భోజనం ముగిసేసరికి పదిన్నర దాటింది. అప్పటికి ఆమె పూర్తిగా మారిపోయింది. కొంతసేపటి క్రిందటి ఆతృత కాని, సందేహము కాని ఆమెలో లేదు.

"పోలీస్‌కి ఫోన్ చేస్తాను..." అన్నాను. మా మధ్య ఉండవలసిన బాంధవ్యంకాక వేరుగా ఏదో పెరుగుతోందనే భావం నాలో



బలించి పోయింది. జీవితం అంతా ఇంకా భవిష్యత్‌లోనే ఉన్న ఆమెని నానుంచీ, తనవించీ రక్షించాల్సిన బాధ్యత నామీదే ఉందని బలంగా జ్ఞాపకం చేసుకున్నాను.

ఆమె నవ్వుతూ, "ఏం? నన్ను వెంటనే పంపెయ్యాలని ఉందా?" అంది. ఆ నవ్వు నా ఆత్మగౌరవానికి వెక్కిరింపులాగా — సున్నితమైన వెక్కిరింపులాగ ఉంది. అందులో ఏ మధుర సంగీతమూ నాకు వినపడలేదు.

"అవును," అన్నాను.

"ఏం?'' అంది. అమ్మాయి అమాయకత్వంకన్న మానవుడిలో అజ్ఞానం కలిగించేవి చాలా తక్కువ.

ఫోన్ చేశాను.

రాత్రంతా కర్ఫ్యూ: శ్యాంబజార్‌లో ఉదయం ఆరుగంటలదాకా. చౌరంగీలో ఐదు గంటలదాకా నగరంలో చాలాచోట్ల విధ్వంసకచర్యలు జరిగాయట: కొన్ని కార్లూ బస్సులూ రోడ్లమీద ఇంకా కాలుతూనే ఉన్నాయి...

ఆమెకి చెప్పేను.

రేడియోలో అదే చెప్పేరు" అంది.

ఆలోచనల్లో చాలాసేపు నిశ్శబ్దంగా గడిచిపోయింది.

"మీకు శ్రమ ఇస్తున్నందుకు విచారంగా ఉంది," అనే ఆమె మాటలతో మళ్ళీ ప్రస్తుతానికి వొచ్చాను. ఆమె మాటల్లో విచారం ఎక్కడా కనపడలేదు నాకు...ఆమె నవ్వు దాచుకుంటున్నట్లుంది.

"శ్రమ ఏమికాదు — పదకొండు కావొస్తుంది. నిద్రరావడం లేదూ?"

"మీకు వొస్తూందా?"

"ఆఁ..."

"వెళ్ళి పడుకోండి.... నే నీ సోఫాలో పడుకుంటాను."



నేనే ఇక్కడ పడుకుంటాను — నువ్వు లోపలపడుకో," అన్నాను. ఆమె ఆ రాత్రికి నా అతిథి: ఆమెకి బెడ్‌రూమ్ ఇవ్వకపోతే నాకు ఎలాగా నిద్రరాదు.

"నాకు ఎయిర్‌కండిషన్డు రూములో నిద్రపోయే అలవాటులేదు..."

"నిజానికి; నాకూ లేదు.''

ఆమె కిటికీలోనించి బయటికి చూస్తూ, "మీరు వెళ్ళి పడుకోండి...నా కింకా నిద్ర రావడంలేదు. నక్షత్రాలని చూసి ఎంతోకాలం అయిపోయింది," అంది.

''రాత్రంతా జాగరం చేస్తావా? పదకొండు కావొస్తూంది...'' అన్నాను.

ఆమె విలాసంగా నవ్వింది, వెక్కిరిస్తోన్నట్టు. నా అధికార ప్రదర్శనకి నవ్వుతోందా?

అలాగే అనిపించింది. సాయంత్రం నించీ ఆమె అలాగ కనిపించలేదు ...

అవతల ఎక్కడో ఫైర్ ఇంజన్ గంట స్పష్టంగా వినవొచ్చింది. నా ఆలోచనలు కట్టిపెట్టి లోపలికి వెళ్ళేను. కిటికీ తీసి, ఎయిర్‌కండిషనర్ ఆపి, రీడింగ్‌లైట్ వెలిగించి పుస్తకం తీసుకున్నాను.

కళ్ళు పంక్తులమీద నిలవడంలేదు—ఆమె పరిహాసన చేస్తోన్నట్టే అనిపించింది. ఇరవై ఏళ్ళయౌవనం, నలభై దాటిన అనుభవాలని చూసి నవ్వుతోందా?

"లైటు తీసెయ్యండి..."

ఆమె గుమ్మంలో నిలబడి నావైపే చూస్తూ, అంది.

నీ పేరు చెప్పు...తీసేస్తాను."

సహజంగా అడిగాను...ఎంత మూర్ఖంనో అనిపిస్తుంది, ఈ రోజుతలుచుకుంటే.

మళ్ళీ అదేనవ్వు.

"నా పేరు—''

ఆమె వొచ్చి పరుపుమీద కూర్చుని నా కళ్ళల్లోకి చూస్తూ ''చంచల'' అంది. నా ఎదనించి అటువాలి, దీపం తీసేసింది.

సంఘంలో ఒకడిగా, గృహస్థుడిగా, స్నేహితుడి అతిథిగా, రక్షకుడిగా అనేక విధులు క్షణమాత్రం నన్ను కలవర పెట్టేయి. ఆక్షణం—కలవరపడ్డ ఒక్కక్షణం—ఇప్పటికీ నాకు జ్ఞాపకమే.

ఒక్కక్షణం...

ఆ అవతారాల కలవరాలని మానవుడు అడిపిపెట్టడంతో ఆ చీకటంతా వెన్నెల ఐపోయింది. రాత్రి ఎప్పుడో, మత్తుగా వొస్తూన్న నిద్రలో, చంచల—ఆమెపేరు కాదని తెలుసుకున్నాను. ఆమె చివరికి అన్నమాటలు జ్ఞాపకం ఉన్నాయి... తనని గురించి ఆలోచన వొద్దంది. తనని మరిచిపోయే వాగ్దానం తీసుకుంది.

మర్నాడు నేను లేచేసరికి తొమ్మిది దాటింది.

తెలివొచ్చి ఆమెకోసం చూశాను. ఇంట్లో ఎక్కడా ఆమెలేదు. తలుపులు చూశాను. తాళంతీసి ఉంది.

నాకు తెలివి వొచ్చేలోపున ఆమె వెళ్ళిపోయింది.

రాత్రి జరిగినదానిలో మాధుర్యం పోయి, నా బలహీనతకి నామీద నాకే అసహ్యం వేసింది. ఆమెపరిస్థితుల్ని ఆమె అజ్ఞానాన్నీ ఉపయోగించుకున్న నేరం, ఆలోచల్ని చేదు చేదుగా చేసింది. నాలో ఉన్న, దాచుకున్న, నైతిక పతనం నన్ను అపహసించింది.

ఆబాధ ఈనాటికీ పోలేదు.

ఆరోజు బయటికి వెడుతూంటే పర్సు తీసి చూసుకునేసరికి నాకు ఆశ్చర్యం వేసింది—అదీ మరిచిపోలేదు. నూరు రూపాయిలు తక్కువగా ఉండడం నాకు అర్థంకాలేదు.

చంచల తీసుకుందా?

కాదు...కాదు... ఆమె నాచేత మోసగించబడిన అమ్మాయి: దొంగకాదు! ఐతే, మిగిలిన మూడువొందలు ఎందుకు వొదులుతుంది?

అవన్నీ ప్రయత్నించి మరిచిపోయాను— ఈరోజుదాకా. ఆమెని గురించిన వెయ్యి ప్రశ్నల్ని, ఆమె ప్రవర్తనకి అర్థాన్ని, అణచిపెట్టుకున్నాను — ఇప్పటిదాకా — ఆమె కనిపించడంతో వాగ్దానాల పాశాలు ఒక్కసారి సడలిపోయి ఈ ప్రశ్నలన్నీ మళ్ళీ బయటికి వొచ్చాయి. నా నేరం మళ్ళీ ఒక్కసారి నన్ను బాధపెట్టసాగింది.

* * *

కాఫీ వొచ్చింది.

ఆమె, అతనూ అప్పుడే లోపలికి వొచ్చి నాపక్క టేబిల్ దగ్గర కూర్చున్నారు.

ఏదో మాట్లాడుకుంటున్నారు. నన్ను ఆమె చూసినట్టే లేదు. అతను ఐస్‌క్రీమ్‌కి ఆర్డరిచ్చి చేతులు కడుక్కోడానికి లోపలికి వెళ్ళాడు.

నేను తలయెత్తి ఆమెని చూడకుండా ఉండేందుకు ప్రయత్నించాను. కొద్ది క్షణాలే అయివుంటుంది — నాకు యుగాల్లాగ అనిపించినా.

"నమస్తే!"

నెమ్మదిగా ఆమె నా వొంక తిరిగిఅంది.

"నమస్తే" అన్నాను పొడిగా. ఆమె ఈరోజు చిరునవ్వుతో నన్ను పలకరించలేదు — నాకూ తెలుసును.

"కులాసాగా ఉన్నారా?"

"ఆఁ..."

"ఏమిటా పుస్తకాలు?''

ఒకటి చేతిలోకి తీసుకుంది. మా మధ్య శృంఖలాలతో బంధించిన నిశ్శబ్దాన్ని జయించేప్రయత్నాలు విఫలమవుతున్నాయి.

ఆమె ఏదో చెప్పే ప్రయత్నంలో ఉంది ... కాని, మాటలు రావడం లేదు.

నేనూ ఏదో అడిగే ప్రయత్నంలో ఉన్నాను. మాటలు రావడంలేదు.

ఇంతలో అతను వొస్తూ మేనేజర్ టేబిల్ దగ్గర ఆగి టెలిఫోన్ చేస్తున్నాడు.

ఆమె బ్యాగ్‌లోనించి పెన్ తీసి, నా పుస్తకం ముఖపత్రంలో ఏదో రాసి, అతను వొచ్చేలోగా పుస్తకం నాకు ఇచ్చేసింది. అతను మరో క్షణంలో వొచ్చేడు.

నేను కాఫీతాగి, బిల్ చెల్లించి, బయటికి వచ్చాను. ఎండ తీవ్రత ఈసారి మరీ స్పష్టంగా తెలిసివొచ్చింది.



అంతకన్నా నన్ను బాధపెట్టిన విజం కాలిలో ముల్లులాగ మనసుకి గుచ్చుకుంటూంది.

ఆమె, అతని రాకతో నా ఉనికిని పూర్తిగా మరిచి పోయింది! పూర్తిగా మనసూ, ముఖమూ, అతనివైపే తిప్పి, సంభాషణ సాగించింది.

ఈ విజం నాకు కొంత ఉపశమనాన్ని ఇచ్చింది... ఆమె నన్ను క్షమించగలిగిందన్నమాట! ... కాని, ఆ క్షమవెనుక ఉన్న మరపు నా స్వాభిమానాన్ని వెక్కిరించింది. ఈ రెండుభావనల మధ్యా చిరాకుపడిపోయాను.

బయట టాక్సీ దొరికింది, తలుపు తీసి ఎక్కుతూండే పాత మిత్రుడొకడు కనిపించేడు. అతనూ పనిమీద హౌరా స్టేషన్ వెడుతూండడాన్న నాతో వొచ్చి, నా రైలు కదిలే దాకా ఉండిపోయాడు.

రైలు పదిమైళ్ళు వెళ్ళేకగాని, చంచల నా పుస్తకంలో ఏదో రాసినమాట గుర్తురాలేదు.

త్వరగా పుస్తకంతీసి – చదివేను. రెండు పంక్తులు – గుండ్రని, వొంకర, అక్షరాలతో ...

"నేను చేసిన దానికి క్షమించండి: అనుకోకుండా క్షణిక దౌర్బల్యంలో మిమ్మల్ని మోసగించేను –"

సంతకానికి, 'జి' రాసింది ఇంగ్లీషులో.

నా కర్థం కాలేదు, ఆమె అంటోన్నది ఏమిటి?

మళ్ళీ, మళ్ళీ ఆ పంక్తులు చదివేను. సంతకం 'జి' కాదనీ, 'సి' వొంకరకగా రాసిందనీ అనుకున్నాను.

మిగిలినమాటలకి అర్థంఏమిటి? ఆమెనన్ను ఎలాగ మోసగించింది? 'క్షమాపణ' దేనికి?

చాలా ఆలోచించాక, ఆమె తీసుకున్న డబ్బుకోసం ఈ పంక్తులు రాసిందని అంగీకరించాను. వేరే ఏమీ అర్థం పాలుకాలేదు.

ఆ తరవాత మరొక సమస్య ఎదురైంది... ఆ పుస్తకం సుజాత చూస్తే చాలా చాలా ప్రమాదం. పుస్తకం పారెయ్యడం ఇష్టంలేదు ... మరీ మంచిపుస్తకం.

జాగ్రత్తగా ముఖపత్రం చింపి, చిన్న చిన్న ముక్కలు చేసి, కిటికీలోనించి రాత్రిలోకి పారేశాను. నా కంపార్ట్‌మెంట్‌లో ఉన్న మిగిలిన ముగ్గురూ రాత్రి బాగా ఆలశ్యం కావడాన్న నిద్ర పోతున్నారు. నేను చేసిన పని వాళ్ళెవరూ చూడలేదు.

తేలిక మనసుతో నిట్టూర్చి, నేను నిద్ర పోయే ప్రయత్నం మొదలు పెట్టేను.